జీఎన్ఐటీఎస్‌లో ఇమేజ్ ఫ్యుజన్‌పై అవగాహన

గోల్కొండ: ఇమేజ్ ఫ్యుజన్ నూతన వ్యూహాత్మక ఏకీకరణపై అవగాహన ఉండాలని డాక్టర్ సి.పద్మజ అన్నారు. ఇమేజ్ ఫ్యుజన్ టెక్నిక్స్ అండ్ అప్లికేషన్స్ ఫర్ ఎన్‌హ్యాన్స్‌డ్ విజువల్ పర్సెప్షన్‌పై సోమవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో వర్క్‌షాప్ జరిగింది. ఏఐసీటీఈ వారి అటల్ అకాడమీ సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో బెంగళూరు, హైదరాబాద్ జేఎన్‌టీయూహెచ్, ఎన్ఐటీ వరంగల్ తదితర విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు పాల్గొని ఇమేజ్ ఫ్యుజన్‌పై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.టి.ఎస్, కళాశాల ప్రిన్సిపల్ కె.రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణకు మార్గమేది..?

- ఇతర మున్సిపాలిటీల్లో జరుగుతున్న క్రమబద్ధీకరణ
- ప్రస్తుత మార్గదర్శకాలపై లబ్ధిదారుల ఎదురుచూపులు



శంషాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం

శంషాబాద్: ప్లాట్లు లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ కోసం రెండేళ్ల కిందట ప్రభుత్వం స్వీకరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో శంషాబాద్ మున్సిపాలిటీ నుంచి వేలాది దరఖాస్తులు నమోదయ్యాయి. దానికి కారణం ఇక్కడ ఉన్న వందకు పైగా అక్రమ లేఅవుట్‌లలో ప్లాట్లు కొన్నవారు వాటిని క్రమబద్ధీకరించుకోడానికి సర్కారు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు దరఖాస్తులు సమర్పించారు. మున్సిపాలిటీలో మొత్తం 6,672 మంది ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసినట్లు రికార్డుల్లో ఉన్నాయి. ఇటీవలే ఇతర మున్సిపాలిటీల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి వాటిని క్రమబద్ధీకరించే ప్రక్రియ కొనసాగుతోంది. కానీ శంషాబాద్ మున్సిపాలిటీలో మాత్రం ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు మార్గం సుగమయ్యే అవకాశాలు దాదాపుగా లేవనే చెప్పాలి.

జీవో 111 ఉన్నా దరఖాస్తుల స్వీకరణ

2020–21 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల నుంచి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వీకరించింది. అదే సమయంలో జీవో 111 నిబంధన ఉన్నా శంషాబాద్ మున్సిపాలిటీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ జరిగింది. వేలాదిమంది నుంచి దరఖాస్తులను స్వీకరించిన జీవో 111 కారణంగా వాటిని క్రమబద్ధీకరించేందుకు అడుగు ముందుకు పడలేదు. గత ప్రభుత్వ హయంలో జీవో 111 తొలగిస్తున్నట్లు చెప్పినప్పటికి కొత్త మార్గదర్శకాలను సైతం ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉంది.

ప్రభుత్వ ఆదేశాల కోసం...

కొత్త సర్కారు జీవో 111 స్థానంలో కొత్తగా వచ్చిన జీవో 69 ప్రకారం నూతన మార్గదర్శకాలు విడుదల చేస్తుందా.. కనీసం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు మోక్షం కల్పిస్తుందా...? గతంలో అనధికారిక లే అవుట్‌లలో కూడా రిజిస్ట్రేషన్‌లకు అవకాశముండేది. 2020 అనంతరం అనధికారిక లే అవుట్‌లలో తొలిసారి చేసే రిజిస్ట్రేషన్‌లు కూడా పూర్తిగా నిలిచిపోయాయి. మరోవైపు నిబంధనలు ఖాతరు చేయని అక్రమార్కులు మాత్రం కొత్త లే అవుట్‌లు చేసి వాటిని గుంటల కింద్ర విక్రయిస్తూ కోట్లు గడుస్తున్నారు. అనధికారిక లేఅవుట్‌లలో ప్లాట్లు కొనుగోలు చేస్తున్న వేలాది మంది సామాన్యులు మాత్రం ఇళ్లు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత సర్కారు స్థానికంగా ఉన్న ఈ సమస్యపై దృష్టిసారించి మార్గదర్శకాలు విడుదల చేస్తుందా లేదా అన్నది వేచి చూడాల్సిందే.

ఆలయ పునర్నిర్మాణానికి గడప పూజ



గడప పూజలో పాల్గొన్న కమిటీ సభ్యులు

రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని కోట మైసమ్మ ఆలయ పునర్నిర్మాణం సందర్భంగా సోమవారం గడప పూజ నిర్వహించారు. శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెండ్యాల సాయి మల్లిక్, ఆలయ కమిటీ సభ్యులు దేవదాస్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, శ్రీధర్, కేశవులు, కిరణ్ యాదవ్, అరవింద్, శేఖర్ గౌడ్, వినయ్ కుమార్, వెంకట్, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం



షాక్ సర్క్యూట్‌తో కాలిపోయిన ఏసీ

మణికొండ: విద్యుత్ షాక్ సర్క్యూట్‌తో గృహపకరణాలు కాలిపోయిన సంఘటన మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ...హనుమాన్‌నగర్ పక్కనే ఉన్న సరిగమ అపార్ట్‌మెంట్ 501 ఫ్లాట్‌లో సోమవారం వారం మధ్యాహ్నం ఒక్కసారిగా పొగ, మంటలు రావడంతో ఇంట్లోని వారు బయటకు పరుగులు తీశారు. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఏసీ, ఫ్రిడ్జ్, టీవీ తదితర వస్తువులు కాలిపోయాయి. విద్యుత్ హెచ్చుతగ్గుల కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నమన్నారు.

'డెస్టిని' బ్రోచర్ విడుదల



బ్రోచర్‌ను విడుదల చేసిన నిర్వాహకులు, మోడల్స్

మాదాపూర్: నూతన సంవత్సర వేడుకలను మాదాపూర్ ఎన్‌కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఐశ్వర్యసాయి తెలిపారు. మాదాపూర్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డెస్టిని పేరిట డిసెంబర్ 31వ తేదీ నూతన సంవత్సరం వేడుకల్లో యువతను ఆకట్టుకునే విధంగా 4 స్టేజీలను ఏర్పాటు చేసి 8 మంది కళాకారులతో బ్యాండ్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అనంతరం డెస్టిని న్యూ ఇయర్ వేడుకకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చుండూరి ఫణి, వినీత్‌బల్లి తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు



కేక్ కట్ చేసిన మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి



కోకాపేటలో జరిగిన క్రిస్మస్ ఉత్సవాల్లో పాస్టర్‌ను సత్కరించిన జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్‌లు



నార్సింగిలో క్రిస్మస్ ఉత్సవాల్లో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్ తదితరులు

మణికొండ: ఏసుక్రీస్తు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని క్రిస్టియన్‌లు నిర్వహించుకునే క్రిస్మస్ పండగ సందర్భంగా సోమవారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని చర్చిలలో ప్రార్థనలను ఘనంగా నిర్వహించారు. ఆయా చర్చిలలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, వైస్ చైర్మన్ జి.వెంకటేష్‌యాదవ్, టీపీసీసీ సభ్యుడు ముంగి జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్‌లు పండగలు మనకు సంతోషాలను పంచుతాయన్నారు. కుల, మతాలకు అతీతంగా అందరూ కలసికట్టుగా వాటిని నిర్వహించుకున్నపుడే అందరూ ఆనందిస్తారన్నారు. ఈ సందర్భంగా పలు చర్చిలలో కేక్‌లను కట్ చేసి క్రిస్టియన్‌లకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. కోకాపేటలో జరిగిన ఉత్సవాల్లో కౌన్సిలర్‌లు జి.శివారెడ్డి, విజయ్‌బాబు, దుర్గేష్‌యాదవ్, నాయకులు హరిబాబు, సురేష్, నార్సింగిలో జరిగిన కార్యక్రమాల్లో రాము, వేణుగౌడ్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



వట్టినాగులపల్లిలో జరిగిన ఉత్సవాల్లో కేక్ కట్ చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి

అత్తాపూర్: అత్తాపూర్‌లోని ఎజేప్ చర్చిలో సోమవారం క్రిస్మస్ పండగను పురస్కరించుకుని క్రిస్టియన్‌లు ఆయనను ఆరాధించారు. పాస్టర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ప్రార్థనల్లో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జీసస్‌ను నమ్ముకున్న వారికి అంతా మంచే జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

క్రిస్మస్ కేక్ కట్ చేసిన సబితారెడ్డి

అత్తాపూర్: క్రిస్మస్ పండగను పురస్కరించుకుని రాజేంద్రనగర్ మాజీ కౌన్సిలర్ సౌభాగ్య ఆధ్వర్యంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.



నార్సింగిలో జరిగిన ఉత్సవాల్లో కేక్ కట్ చేసిన అశోక్‌యాదవ్ తదితరులు



క్రిస్మస్ సంబురాల్లో పాల్గొన్న క్రైస్తవులు



క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న అత్తాపూర్ వాసులు

విద్యారంగ వ్యాప్తికి నిరంతర కృషి



ప్రిన్సిపల్ బ్రదర్ షజాన్ ఆంథోనికి అవార్డు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

అబిడ్స్: విద్యారంగ వ్యాప్తికి నిరంతరం కృషి చేస్తానని అబిడ్స్ లిటిల్ ఫ్లవర్ పాఠశాల ప్రిన్సిపల్ బ్రదర్ షజాన్ ఆంథోని పేర్కొన్నారు.విద్యారంగంలో కొన్ని సంవత్సరాలుగా విశిష్ట సేవలందిస్తున్న బ్రదర్ షజాన్ ఆంథోనికి ఎమినెంట్ క్రిస్టియన్స్ ఉత్తమ విద్యారంగవేత్తగా అవార్డును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయనకు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా బ్రదర్ షజాన్ ఆంథోని మాట్లాడుతూ..విద్యార్థులకు బాల్య దశ నుంచే విద్యతో పాటు సాంస్కృతిక, సామాజిక, ఇతర రంగాల్లో కూడా రాణించే విధంగా నిరంతరం పాటుపడుతున్నట్లు తెలిపారు. సామాజిక సేవపై విద్యార్థులకు చిన్న వ్పటి నుంచే అవగాహన కల్పించడం ద్వారా పెద్ద అయిన తర్వాత వారిలో సామాజిక దృక్పథం వస్తుందని ఆయన అన్నారు. తమ లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పలు రంగాల్లో అగ్రగామిగా ఉండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

క్రాఫ్ట్ మేళా.. నృత్య ప్రదర్శనలు



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళా సందర్శకులను ఆకట్టుకుంటుంది. మేళాలో భాగంగా సోమవారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీవల్లీరావు శిష్య బృందం కథక్ నృత్యప్రదర్శనతో అలరించారు. ఇందులో గణేశ్ వందన, గురు వందన, దుర్గస్తుతి, చపాతీలక్, హోరితరణ అంశాలను ప్రదర్శించారు. అలాగే లక్ష్మీ శంకర్ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. వినాయక కౌతం, గీత రసికే, జటాధరా, కొలువైతివా, గురుస్తుతి తదితర అంశాలతో అలరించారు.

ఎస్సై అదృశ్యం కలకలం

రాజేంద్రనగర్: గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎస్సై రాజేశ్వర్ రెడ్డి అదృశ్యం కలకలం సృష్టించింది. రాజేశ్వర్ రెడ్డి భార్య ఆశాలత రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ లో సోమవారం సాయంత్రం తన భర్త కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఉరుకులు పరుగులు పెట్టారు. ఉప్పర్ పల్లి ప్రాంతానికి చెందిన రాజేశ్వర్ రెడ్డి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం విధులకు వెళుతున్నానని భార్య ఆశాలత కు తెలిపి ఇంట్లో నుంచి వెళ్ళాడు. అనంతరం మధ్యాహ్నం సమయంలో భార్య సెల్ ఫోనుకు మీరంతా బాగుండాలని తెలుపుతూ ఎస్ఎంఎస్ చేశాడు. దీంతో ఈ విషయాన్ని ఆశాలత రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ వెళ్ళి ఫిర్యాదు చేసింది. పోలీసులు ఎస్ఐ సెల్ ఫోన్ కు ప్రయత్నించక స్విచ్ ఆఫ్ రావడంతో కంగారు పడ్డారు. చివరకు రాజేశ్వర్ రెడ్డి రాత్రి 8 గంటల సమయంలో తాను బెంగళూరులో ఉన్నానని ఆశాలతతో ఫోన్‌లో చెప్పడంతో అందరు ఊపిరి పిలుచుకున్నారు. భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా ఎస్సై సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినట్టు ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు. ఈ విషయమై ఇన్స్పెక్టర్ వివరణ త్వరగా అదేం లేదని వెల్లడించారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చార్మినార్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని విరించి ఆసుపత్రి చైర్ పర్సన్ మాధవీలత కోరారు. వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని బీజేపీ మెడికల్ సెల్ ఆధ్వర్యంలో బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ దారుషిఫాలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను ఆమె ప్రారంభించి వైద్య సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాండు యాదవ్, ఉమామహేందర్, షఫత్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

27న సిటీ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం ఇంటర్వ్యూ

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాలలో 2023–24 సంవత్సరానికి తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థులు ఈనెల 27న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూకి హాజరుకావాలని ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. బయో టెక్నాలజీ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టుకు గాను పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులని, పీహెచ్‌డీ, ఎం.ఫిల్, నెట్, స్లెట్ వంటి అదనపు అర్హతలతో పాటు బోధనానుభావం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు తమ అర్హతలు ధ్రువీకరణ పత్రాలు తీసుకుని కళాశాలలో బయోటెక్నాలజీ శాఖాధిపతిని సంప్రదించాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జగన్నాథం

గోల్కొండ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా టోలిచౌకీ అక్బర్‌పురాకు చెందిన పి.జగన్నాథం నియమితులయ్యారు. ఆయన సోమవారం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.రాజలింగం చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంతో పాటు రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా కూడా దళితులు వారు ఆశించిన స్థాయిలో అభివృద్ధి ఫలాలను అందుకోలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో టి.కన్నయ్య తదితరులున్నారు.

వైభవంగా దత్త జయంతి

గౌలిపురా: దత్త జయంతి సందర్భంగా లాల్‌దర్వాలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. గౌలిపురా మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర, ఆలయ ధర్మకర్త ప్రసాద్ దీక్షిత్, భక్తులు జి.ప్రసాద్ కుమార్, ఇ.సుమన్ కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదకర స్థితిలో ట్రాన్స్ ఫార్మర్



ట్రాన్స్ ఫార్మర్‌కు తగిలి మృత్యువాత పడ్డ ఆవు

- పట్టించుకోని విద్యుత్ అధికారులు
- గతంలో ఇదే ట్రాన్స్ ఫార్మకు తగిలి గేదె మృతి

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి మూగజీవాలు బలి అవుతున్నాయి. ట్రాన్స్ ఫార్మర్‌లకు చుట్టూ కంచె లేకపోవడంతో మేత మేయడానికి వెళ్లి కరెంట్ షాక్‌తో చనిపోతున్నాయి. రహదారి గుండా వెళ్తున్న ఆవు ట్రాన్స్ ఫార్మర్ క్రింద గొదుమపిండి, చెత్త ఉండడంతో మేత మేయడానికి వెళ్లింది. ట్రాన్స్ ఫార్మర్ క్రిందికి ఉండడంతో ఆవు కరెంటు తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందినది. నెల రోజుల క్రితం టీఎన్జీవోస్ కాలనీలో ఓ బాలుడు ఆడుకుంటూ ట్రాన్స్ ఫార్మర్‌పైకి ఎక్కి తీగలకు తాకడంతో షాక్‌కు గురై దవాఖానలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. గతంలో కాటేదాన్ పరిశ్రమలో ముత్తయ్య పవర్‌లూమ్స్ చెందిన ట్రాన్స్ 63 కేవీ కరెంటు ట్రాన్స్ ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉన్నది. దాని చుట్టూ ఎలాంటి కంచె వేయకపోవడంతో ఓ గేదె కరెంట్ షాక్‌తో చనిపోయింది. ఇలా మూగ జీవాలను బలి తీసుకుంటున్న ట్రాన్స్ ఫార్మర్ ఆరు అడుగుల ఎత్తుకి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదకరంగా ఉన్నా ట్రాన్స్ ఫార్మర్‌లకు చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని అధికారులు పరిశ్రమల యజమానులకు ఆదేశాలు జారి చేసినట్లయితే ఇలా మూగజీవాలు బలి కాకుండా ఉండేవని స్థానికులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూగజీవాలే కాకుండా మనుషుల ప్రాణాలు కూడా పోయె అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైన అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌లను గుర్తించి కంచె ,లేదా వాటి ఎత్తు పెంచాలని ప్రజలు ఆశిస్తున్నారు.

ట్రాన్స్ ఫార్మర్‌ల చుట్టూ కంచె వేయాలి



కాటేదాన్ పారిశ్రామిక వాడలో ప్రమాదకరంగా అనేక ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నాయి. విద్యుత్ అధికారులు గుర్తించి వాటికి కంచెను ఏర్పాటు చేయాలి. లేదంటే మూగజీవాలతో పాటు మనుషుల ప్రాణాలు కూడా గాలిలో కలిసే అవకాశాలు ఉన్నాయి. విద్యుత్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నా.

–రామక్రిష్ణారెడ్డి–టీఎన్జీవోస్ కాలనీ

ఘనంగా వాజ్ పేయి జయంతి



అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: నీతి నిజాయితీకి మారుపేరుగా నిలిచిన గొప్ప వ్యక్తి అటల్ బిహారీ వాజ్‌పేయి అని రాజేంద్రనగర్ బీజేపీ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం కాటేదాన్ బీజేపీ పార్టీ కార్యాలయంలో వాజ్‌పేయి 99వ జయంతిని పురస్కరిచుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ ముద్దుబిడ్డ జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు, దేశ మాజీ ప్రధాని భారత రత్న అటల్ బిహారీ వాజ్ పేయి దేశానికి చేసిన సేవలను గుర్తు చేశారు. ఆయన అడుగు జాడల్లో యువత నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలను సూచించారు. ఈ కార్యక్రమంలో జోగి రవి, బుచ్చిరెడ్డి, సంతుగౌడ్, తలారి చిన్న, శ్రీకాంత్ రెడ్డి, రమమ, శ్రావణ్ కుమార్, అనిల్ రెడ్డి, రామారావు, శేఖర్, చందు, పాల్గొన్నారు.

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ కస్తూరి బాయి ఆశ్రమంలో భారత మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి 99వ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కె. మహేష్‌యాదవ్, మణికొండ మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు సి.బీరప్పల ఆధ్వర్యంలో మాజీ ప్రధాని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ కో కన్వీనర్ బి. మహాలింగంగౌడ్, రాష్ట్ర ఎస్సీ మోర్చా నాయకులు పి. సత్యనారాయణ, పి.ఎస్. మల్లారెడ్డి, శంకర్‌సింగ్, నరసయ్యచారి, వినోద్, ఆనంద్‌రావు, దామోదర్, రంగబాబు, శివరాంరెడ్డి, గోపాల్, ప్రవీణ్‌గౌడ్, రాజేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మణికొండ: ప్రస్తుత రాజకీయాల్లో నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి జీవితాంతం పనిచేసే వారు ఎక్కడో ఒకరు ఉంటారని, అలాంటి వారంతా మాజీ ప్రధానమంత్రి అటల్ బీహారీ వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సోమవారం ఆయన జయంతిని పురస్కరించుకుని నార్సింగి బీజేపీ పార్టీ అధ్యక్షుడు సీహెచ్. బిక్షపతియాదవ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అటల్‌జీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రస్తుత రాజకీయాల్లో పదవులను కాపాడుకునేందుకు అడ్డగోలు పనులు చేస్తున్నారన్నారు. అలాంటిది ఒక్క ఓటుతో కేంద్ర ప్రభుత్వం పడిపోతున్నా ఎలాంటి అక్రమాలు చేయకుండా నిస్వార్థంగా తప్పుకున్న ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి. లక్ష్మీనారాయణ, ఎం. నగేష్‌యాదవ్, శివారాజ్ తదితరులు పాల్గొన్నారు.



వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



అటల్ బిహారీ వాజ్‌పేయికి నివాళులు అర్పించిన బీజేపీ నాయకులు

గుడిమల్కాపూర్‌లో శ్రీరాముడి అక్షింతలు



అయోధ్య నుంచి అక్షింతల పవిత్రయాత్ర

గోల్కొండ: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడు అక్షింతలు సోమవారం గుడిమల్కాపూర్‌కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కార్వాన్ సబ్జిమండి నుంచి అక్షింతల కలశాలను గుడిమల్కాపూర్ నుంచి రామాలయానికి తెచ్చారు. మంగళవాయిద్యాలు, శ్రీరాముడి నినాదాలతో ఈ పవిత్ర యాత్రలో బీజేపీ నాయకులు దేవర వంశీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం: డీసీపీ సాయి చైతన్య

చాంద్రాయణగుట్ట: శారీరక ధృడత్వం కోసం క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య అన్నారు. అలియాబాద్ పూల్‌బాగ్ ప్లే గ్రౌండ్‌లో రెండు రోజుల పాటు కొనసాగిన 'టైగర్ నరేంద్ర మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్–3'ముగింపు వేడుకలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని..కాసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ప్రోత్సహించారు. బీజేపీ నాయకుడు ఉదయ్ కిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో మొత్తం 16 జట్లు పాల్గొనగా..పూల్‌బాగ్ క్రికెట్ క్లబ్ విజేతగా నిలిచింది. విరాట్ క్రికెట్ క్లబ్ రన్నరఫ్‌గా నిలిచింది. విజేత జట్టుకు ఈ సందర్భంగా డీసీపీ ట్రోఫితో పాటు రూ.20 వేల నగదును, రన్నరఫ్ జట్టుకు రూ.8 వేల నగదు, ట్రోఫిని బీజేపీ కార్పొరేటర్లు ఆలే భాగ్యలక్ష్మి, ఎ.వినయ్ కుమార్‌తో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్ జహంగీర్, గౌలిపురా మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, బీజేపీ నాయకులు ఉమామహేంద్ర, కొడీ మహేందర్, ప్రశాంత్, ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.